క్లుప్తంగా

27న లీడ్ బ్యాంకుల ఎదుట ధర్నా

తాడేపల్లిరూరల్: జిల్లా లీడ్ బ్యాంక్ వద్ద ఈ నెల 27న నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు కోరారు. సోమవారం దుగ్గిరాల గ్రామంలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో 70 శాతం భూమిని కౌలు రైతులు సాగుచేస్తుండగా కేవలం 20 కోట్ల రూపాయలు పంట రుణాలు ఇవ్వడం హాస్యాస్పదమని అన్నారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి మన్నవ నాగమల్లేశ్వరరావు, కౌలు రైతు సంఘం మండల అధ్యక్షులు భీమవరపు అమ్మిరెడ్డి, మాతంగి రమేష్ పాల్గొన్నారు.

నేటి నుంచి నిడమర్రు రైల్వే గేటు మూసివేత

మంగళగిరి: నగరంలో నిడమర్రు రైల్వే గేటును మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే ట్రాక్, రోడ్డు మరమ్మతుల నిమిత్తం ఈ నెల 26 నుంచి 29 తేదీ వరకు రైల్వేగేటు మూసివేయడం జరుగుతుందని, వాహనదారులు గమనించి ఇతర మార్గాలలో ప్రయాణించి రైల్వే అధికారులకు సహకరించాలని కోరారు.

వేమవరంలో స్వచ్ఛత సేవ

ఫిరంగిపురం: మండలంలోని వేమవరంలోని ఎంపీపీ పాఠశాలలో సోమవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత సేవ శపథం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి జీవీఆర్కే మూర్తి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛత హీ సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలు పరిశుభ్రత, ప్రజల భాగస్వామ్యం, చెత్త నుంచి సంపదగా మార్చడం ఎలా, తడి, పొడి చెత్త సేకరణ విధానం గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులకు స్వచ్ఛతపై చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో స్వచ్ఛతసేవ శపథం చేయించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం డి.కమల్‌మోహన్ పాల్గొన్నారు.

ఆటల పోటీలు ప్రారంభం



మంగళగిరి: నగర పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం 67వ ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ ఆటల పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను జె.బ్రహ్మారెడ్డి, కె.రామకోటిరెడ్డి, ఎస్.ప్రవీణ్‌కుమార్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలలో రాణిస్తే మరింత మెరుగైన భవిష్యత్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజీవ్ రతన్, సెలక్షన్ కమిటీ సభ్యులు, పీడీలు బి.రమేష్, ఎస్.రవి, ఎం. సాంబశివరావు, ఎం.హరికృష్ణ, ఎస్.సాంబశివరావు, పద్మ, మంజుల, కె.రజనీనాయక్ పాల్గొన్నారు.

వైభవంగా వినాయక చవితి ఉత్సవాలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరులో ఎస్‌బీ క్యాపిటల్ అపార్ట్‌మెంట్‌లో వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం చిన్నారులతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అసోషియేషన్ ప్రతినిధులు మిత్రారెడ్డి, పిఎస్ఎల్ నారాయణ, ఏడుకొండలు, తిరుమలేష్, కళ్యాణి, శ్యామ్ పాల్గొన్నారు.

లారీని ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడి కోకో కోలా కంపెనీ వద్ద ఆగి ఉన్న లారీని ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. కోకో కోలా కంపెనీ వద్ద రోడ్డు పక్కన లారీ ఆగి ఉండగా అటుగా వెళ్లున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పి లారీని ఢీకొట్టింది. ప్రయాణికులు ఆందోళన చెందగా ఇద్దరు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడడంతో ఊపిరి పీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలను సేకరించి కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతిపై కేసు

ఫిరంగిపురం: యువకుడి అనుమానాస్పద మృతిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని వేములూరిపాడు గ్రామానికి చెందిన ఏ శశికుమార్(26) ప్లంబర్ పనిచేస్తుంటాడు. గ్రామంలో వినాయక నిమజ్జనం సందర్భంగా శనివారం పొద్దుపోయిన తరువాత ఇంటికి వచ్చి ఇంటిపై నున్న గదిలో పడుకున్నాడు. మరునాడు ఉదయం కొడుకు నిద్రలేవకపోవడంతో తల్లి వెళ్లి పొలంపనులకు వెలుతున్నానంటూ చెప్పి వెళ్లింది. సాయంత్రం పొలం నుంచి ఇంటికి వచ్చినా ఇంకా కుమారుడు నిద్రలేవకపోవడంతో తోటివారితో కలిసి డాబాపైకి వెళ్లి కేకలేసినా లేవకపోవడంతో అనుమానంతో చూసింది. అప్పటికే శశికుమార్ మృతి చెంది ఉన్నాడు. శశికుమార్ మృతిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సోమవారం మృతదేహాన్ని నరసరావుపేటలో పోస్టుమార్టం నిర్వహించేందుకు తరలించారు. తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా కిషోర్ తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష మేలు



దుగ్గిరాలలో జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు రహమాన్



మార్కేండేయ కాలనీలో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

మంగళగిరి: నగర పరిధిలోని తొమ్మిది అర్బన్ హెల్త్ సెంటర్‌ల ఏరియాలలో జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే కొనసాగుతోంది. సచివాలయాల వారీగా వైద్య ఆరోగ్య శాఖ ఏఎన్ఎం, ఆశ వర్కర్‌లు, సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించి వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. ఇందిరానగర్, లక్ష్మీనృసింహకాలనీ, మార్కేండేయ కాలనీ, కాజ, ఆత్మకూరు, యర్రబాలెం, నిడమర్రు, రామచంద్రపాలెంలలలో సోమవారం వలంటీర్లుతో కలిసి వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి ప్రజలకు సర్వే గురించి వివరాలను వివరించి పరీక్షలు నిర్వహించడంతో పాటు ప్రథమ చికిత్స నిర్వహించి మరింత మెరుగైన వైద్యం అవసరమనుకున్న రోగులను ఆస్పత్రులకు పంపుతున్నారు.

తాడేపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహిస్తున్నారు. దుగ్గిరాల మండలంలోని దుగ్గిరాల పీహెచ్‌సీ డాక్టర్ అబ్దుల్ రహమాన్, డాక్టర్ ఇంద్రాణి, ఈమని పీహెచ్‌సీ డాక్టర్ శ్రీవల్లి, ఎ.సుకన్య ఇంటింటికి తిరిగి సోమవారం జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పించారు. వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. డాక్టర్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల పరిధిలో 60 శాతం ఇంటింటి సర్వే పూర్తి చేశామని, ఇంటింటికి తిరిగే సమయంలో చిన్నచిన్న సమస్యలకు వైద్యం అందించడంతో



ఫిరంగిపురం కొండమెట్ల బజారులో పరీక్షలు చేస్తున్న ఆరోగ్యసిబ్బంది

పాటు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా ఇస్తున్నామని, వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆ గ్రామంలో ఏర్పాటు చేసే ప్రభుత్వ మెడికల్ క్యాంప్‌లో ప్రత్యేకమైన వైద్యం అందించేందుకు వారికి ఒక టోకెన్ ఇచ్చి వారు రావాల్సిన తేదీని, సమయాన్ని తెలియజేస్తున్నామని, అక్కడ కూడా పరిష్కారం కాకపోతే మెరుగైన వైద్య నిమిత్తం ఆరోగ్యశ్రీ వర్తించే ఆసుపత్రులలో చికిత్స అందించనున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామాల్లో జగనన్న ఆరోగ్యసురక్ష సర్వే

ఫిరంగిపురం: ఫిరంగిపురం పీహెచ్‌సీ సెక్టార్ పరిధిలోని పలు గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే సిబ్బంది నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి పి.ఎస్తేరురాణి తెలిపారు. గ్రామంలోని కొండమెట్లబజారు, రైల్వేస్టేషన్‌రోడ్డు, 113 త్యాళ్లూరు రోడ్డు, రసూల్‌పేట, వసంతనగర్, అల్లంవారిపాలెం గ్రామాల్లో ఆరోగ్యసిబ్బంది ఇంటింటికి తిరిగి అనారోగ్య సమస్యలు అడిగి తెలుసుకుని వాటిని యాప్‌లో అప్‌లోడు చేస్తుండటంతో సోమవారం ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నామేరి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష షెడ్యూల్ విడుదల

తాడేపల్లిరూరల్: ఈ నెల 30వ తేదీ నుండి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఆరోగ్య కేంద్రాల వివరాలను దుగ్గిరాల పీహెచ్‌సీ వైద్యులు అబ్దుల్ రహమాన్ సోమవారం షెడ్యూల్ విడుదల చేశారు. ఈ నెల 30వ తేదీ నుంచి అక్టోబర్ 21 తేదీ వరకు గ్రామాల వారీగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 30వ తేదీ దుగ్గిరాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాయ్స్ స్కూల్, అక్టోబర్ 3న ఈమని-2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 4న చిలువూరు-2 అంబేద్కర్ పాఠశాల, 5న గొడవర్రు, 6న రేవేంద్రపాడు జెడ్పీ స్కూల్, 7న మోరంపూడి పాఠశాల, 9న పేరుకలపూడి ఎంపీయూపీ స్కూల్, 10న శృంగారపురం, 11న మంచికలపూడి, 12న చింతలపూడి పాఠశాలలో.. 13న చిలువూరు-1 షాదీఖానా (కమ్యూనిటీ హాల్), 16న దుగ్గిరాల బాలికల జెడ్పీ స్కూల్, 17న ఈమని-1, 18న పెదపాలెం జెడ్పీ పాఠశాల, 19న కంఠంరాజు కొండూరు పాఠశాల, 20న పెనుమూలి హైస్కూల్ , 21వ తేదీన పెదకొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం



విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేస్తున్న సిస్టర్ నిర్మల జ్యోతి తదితరులు



సెయింట్ జేవియర్‌లో మాట్లాడుతున్న డాక్టర్ నిషాంత్

మంగళగిరి: ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రపంచ ఫార్మసిస్టు దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ రహమాన్ మాట్లాడుతూ సమాజంలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. నూతన మందులు ఆవిష్కరణలు, వ్యాధి నివారణ మందులు, మందుల శాతం ఏ సమయంలో ఎంత డోస్ తీసుకోవాలి అనే అంశాలపై వివరించారు. అవయదానంపై కళాశాలలో ఫార్మాస్యూటిక్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులకు వీడియో మేకింగ్, డ్రాయింగ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలలో విజేతలకు కళాశాల కరస్పాండెంట్ సిస్టర్ నిర్మల జ్యోతి ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఓడీ డాక్టర్ పాములరెడ్డి, ప్రొఫెసర్లు డాక్టర్లు వినయ్‌కుమార్, పద్మావతి, సుధీర్, సుప్రియ, మాధవి, శ్రీ కళ, ప్రమీల పాల్గొన్నారు.

వ్యాక్సిన్ కనుగొన్న ఘనత ఫార్మాసిస్టులదే

ఫిరంగిపురం: కోవిడ్ సమయంలో దానికి తగిన వ్యాక్సిన్ కనుగొన్న ఘనత ఫార్మాశిస్టులదేనని డాక్టర్ నిషాంత్ అన్నారు. మండల కేంద్రంలోని దీనాపూర్ క్యాంపస్‌లోని సెయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాలలో సోమవారం ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 1960 ప్రాంతంలో మానవుడి జీవితకాలం 40 ఏళ్ల మాత్రమేనని కాని ఇప్పుడు అది సరాసరి 80 ఏళ్లకు పెరిగిందని చెప్పారు. అది కేవలం ఫార్మాసిస్టులు చేసిన విలువైన పరిశోధనలు మాత్రమేనన్నారు. చాలా మందులు నాణ్యత పెరగటానికి, కొత్త రోగాలకు మందులు కనిపెట్టటానికి ఫార్మాసిస్టులకే సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ మణిబాబు, మేరి పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



కంతేరులో పుస్తకాలు పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

కంతేరు(తాడికొండ): ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యమిస్తోందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ పేర్కొన్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులకు సోమవారం పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా రాణించాలని సూచించారు. అదనపు గదులు నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని, హిందీ పండిట్ పోస్టు భర్తీ చేయాలని గ్రామస్తులు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి బెజ్జం మహేష్ బాబు, ఉప సర్పంచి నరసింహారావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటేశ్వర రెడ్డి, బాపిరెడ్డి వెంకటేశ్వరరావు, శామ్యూల్, రాఘవరావు, నాగేశ్వరరావు, చిలువూరి అన్నమ్మ పాల్గొన్నారు.

రేపు కేఎల్‌యూ శాటిలైట్ ప్రయోగం

- సర్వం సిద్ధం చేసిన నిర్వాహకులు
- వాతావరణ మార్పులపై పరిశోధనకు ఊతం



ఉపగ్రహాన్ని రూపొందించిన సభ్యులను అభినందిస్తున్న వీసీ పార్థసారథి వర్మ, కిషోర్‌బాబు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కెఎల్ విశ్వవిద్యాలయం సొంత పరిజ్ఞానంతో రూపొందించిన చిన్న తరహా ఉపగ్రహ ప్రయోగం చేయబోతున్నామని వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ అన్నారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమి నుండి సుమారు 35 కి.మీ. ఎత్తు వరకు వాతావరణంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిశోధనలు చేయడానికి కెఎల్ శాట్ పేరుతో ఒక ఉపగ్రహాన్ని ఆకాశంలోకి పంపడానికి అన్ని రకాల అనుమతులు తమకు వచ్చాయన్నారు. లాంచ్ ప్యాడ్‌గా గ్రీన్‌ఫీల్డ్ క్యాంపస్‌లోని క్రికెట్ మైదానాన్ని ఉపయోగిస్తున్నామని, కె.ఎల్.యు మొదటి చిన్న ఉపగ్రహం కెఎల్ శాట్‌ని ప్రయోగించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈనెల 27వ తేదీ ఉదయం 6 గంటలకు క్రికెట్ మైదానం నుంచి ఏటీసీ గన్నవరం పర్యవేక్షణలో ప్రయోగించనున్నామని వివరించారు. వర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ మాట్లాడుతూ దేశీయ పరికరాలతో తయారు చేసినందున కేవలం రూ. 2.75 లక్షల వ్యయంతో చిన్న తరహా ఉపగ్రహాన్ని తమ అధ్యాపకులు, విద్యార్థులు కలసి రూపొందించారని తెలిపారు. మొత్తం 22 మంది ఇసీఇ విద్యార్థులతో ఒక మెకానికల్ ఇంజినీరింగ్ విద్యార్థితో కలసి ఆరు నెలలుగా శ్రమించి ఈ ఉపగ్రహానికి రూపకల్పన చేశారన్నారు. ఇది 35 కి.మీ ఎత్తు వరకు వెళుతుందన్నారు. పరిశోధన, అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ కె. శరత్‌కుమార్ మాట్లాడుతూ ఈ చిన్న తరహా ఉపగ్రహం వాతావరణ కొలత, సాంకేతికతలో ఒక స్మారక పురోగతిని సూచిస్తుందన్నారు. చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా పూర్వ విద్యార్థుల విభాగ డైరెక్టర్ డాక్టర్ కె.సి.హెచ్.కావ్య వ్యవహరిస్తున్నారని అన్నారు. ఉపగ్రహానికి రూపకల్పన చేసిన బృంద సభ్యులను, విద్యార్థులను వర్సిటీ చైర్మన్ కోనేరు సత్యనారాయణ, వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రొ. వైస్ చాన్సులర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం. కిషోర్ బాబు, డీన్ డాక్టర్ ఎ. శ్రీనాథ్ అభినందించారు.

వినాయక గ్రామోత్సవంలో ఘర్షణ

మంగళగిరి: నగర పరిధిలోని పెదవడ్లపూడిలో సోమవారం రాత్రి జరిగిన వినాయకుడి గ్రామోత్సవంలో ఘర్షణ చోటు చేసుకుంది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. పెదవడ్లపూడి వినాయకుడి గ్రామోత్సవం ప్రారంభం కాగా పిల్లలు ఒకరినొకరు తోసుకున్నారు. దీంతో పెద్దలు ఘర్షణకు దిగడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. గాయాలైన జయలక్ష్మి, నరసింహారావు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఫిర్యాదులు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భాషా, సాహిత్యాభివృద్ధికి వావిళ్ల సంస్థ ఎనలేని కృషి

లక్ష్మీపురం: 1854లో పుస్తక ప్రచురణ రంగంలో ప్రవేశించి భాషా, సాహిత్య, సాంస్కృతిక, ఆధ్యాత్మిక సేవలందించిన వావిళ్ల సంస్థ గురించి ఈతరం వారికి తెలియజేయాల్సిన అవసరం ఉందని కవి, రచయిత, అధ్యాపకులు కె .జయకుమార్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన 'వావిళ్ల సంస్థ గురించి తెలుసుకుందాం' అనే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వావిళ్ల సంస్థ వ్యవస్థాపకులు వావిళ్ల రామస్వామిశాస్త్రి ఆయన తనయుడు వావిళ్ల వెంకటేశ్వరశాస్త్రులు సంస్కృతాంధ్ర భాషా, సాహిత్యాలకు అనేక రకాలుగా సేవలు అందించారన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సాహితీవేత్త ఎం.ప్రసాదరావు మాట్లా డుతూ అనేక తాళ పత్ర గ్రంథాలకు చేతిరాతలతో పాటు ప్రాచీన కావ్యాల్ని పండితులతో పరిష్కరింపజేశారని తెలిపారు.

గల్లంతైన వ్యక్తి కోసం రంగంలోకి ఎన్‌డీఆర్ఎఫ్

తెనాలి రూరల్: వినాయక నిమజ్జనానికి వెళ్లి అదృశ్యమైన ఆటో డ్రైవర్ కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. పట్టణంలోని యడ్ల లింగయ్య కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఉప్పు నాగబాబు(30) వినాయకుడి నిమజ్జనానికి స్నేహితులతో కలసి ఈ నెల 21న వెళ్లాడు. వీఎస్సార్ కళాశాల వద్ద తూర్పు కాల్వలో నిమజ్జనం పూర్తయ్యాక మిత్రులతో కలసి కాల్వలోకి దిగిన అతను కనబడకుండా పోయాడు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో భార్య భవాని త్రీ టౌన్ పోలీసుల్ని మరుసటి రోజు ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. ఐదు రోజులు గడుస్తున్న ఆచూకీ లేకపోవడంతో సోమవారం ఎన్‌డీఆర్ఎఫ్ బృందం తెనాలి వచ్చింది. నాగబాబు గల్లంతైన కాల్వలో గాలింపు చర్యలు చేపట్టింది. అయితే, తన భర్తకు ఈత వచ్చని, కాల్వలో పడినంత మాత్రాన గల్లంతవడని, అతను అదృశ్యమవడంపై పలు అనుమానాలు ఉన్నాయని ఆరోపిస్తోంది. విచారిస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

చిన్నారి వైద్యానికి సీఎం సహాయనిధి అందజేత

తాడికొండ: అప్పుడే పుట్టిన బిడ్డ అనారోగ్యంతో వెంటిలేటర్‌పై చికిత్స చేయించుకోగా అయిన ఖర్చును సీఎం సహాయ నిధి ద్వారా ప్రభుత్వం ఆదుకుంది. వివరాలు.. తుళ్ళూరు మండలం అబ్బరాజు పాలెం గ్రామానికి చెందిన బండి ప్రసాద్‌కు చిన్నారి పుట్టగా ఆమెకు ఆరోగ్యం సరిగా లేక వెంటిలేటర్‌పై చికిత్స అందించి నయం చేయించారు. ఆర్థిక స్థోమత అంతంత మాత్రమే కావడంతో ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా రూ.2.76 లక్షలు మంజూరైంది. సోమవారం ఆ చెక్కును వైఎస్సార్‌సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ అందజేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

తాడేపల్లిరూరల్: నిబంధనలకు విరుద్ధంగా మద్యాన్ని విక్రయిస్తున్న వ్యక్తి నుంచి 130 బాటిళ్లను సోమవారం స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాలు.. పోలకంపాడుకు చెందిన కిషోర్ సీతానగరంలో అక్రమ మద్యం అమ్ముతున్నాడని సమాచారం రావడంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా స్థానికంగా ఉన్న ముళ్లపొదల్లోంచి వంద క్వార్టర్ బాటిళ్ల ఇచ్చాడని, అదే ప్రాంతంలో నివాసముంటున్న కిషోర్ బావమరిది అయిన శ్రీనివాసరావు ఇంట్లో మరో 30 బాటిళ్లను భద్రపరిచాడని, మద్యం అమ్ముతున్న కిషోర్‌తో పాటు, మద్యాన్ని భద్రపరిచిన శ్రీనివాసరావులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు.

కురగల్లులో..

మంగళగిరి: నగర పరిధిలోని కురగల్లు అక్రమంగా విక్రయిస్తున్న మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు.. కురగల్లుకు చెందిన పల్లపు నాగేశ్వరరావు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు సోమవారం తనిఖీలు నిర్వహించి 16 మద్యం బాటిళ్లతో నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నర్సిరెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్

వడ్డమాను(తాడికొండ): వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు గొట్టం నర్సిరెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ కోరారు. సోమవారం సాయంత్రం వడ్డమానులోని బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. వినాయక విగ్రహం నిమజ్జనం ఊరేగింపు సందర్భంగా రెచ్చిపోయిన టీడీపీకి చెందిన నాయకులు తమ ఇంటి ఆవరణలోకి వచ్చి బాంబులు కాల్చుతూ ఇష్టారీతిగా రెచ్చపోయారని, బయటకు వచ్చిన మాపై రాళ్లదాడి చేయడంతో ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నామన్నారు. వినాయక నిమజ్జనం ముసుగులో టీడీపీ నాయకులు మహిళలను సైతం దుర్భాషలాడుతూ బయటకు రానీయకుండా బరితెగించి ప్రవర్తించారని, తన కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని బాధితుడు కోరారు. స్పందించిన కత్తెర సురేష్ కుమార్ నిందితులు ఎవరో గుర్తించి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని సీఐ ఆనందరావుకు సూచించారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బుర్రా వెంకట శివారెడ్డి, మాజీ సర్పంచి చుండు వెంకటరెడ్డి, పోలు సురేష్, శ్రీకాంత్ ఉన్నారు.

చలపతి క్రికెట్ లీగ్ పోటీలు ప్రారంభం

మోతడక(తాడికొండ): చలపతి క్రికెట్ లీగ్ పేరిట నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్ సోమవారం ప్రారంభించారు. చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఈ పోటీలు అక్టోబర్ 14 వరకు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు 30 పైగా టీమ్‌లు పోటీ పడుతున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్ తెలిపారు. కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్ మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలు కూడా అవసరమని చెప్పారు. విద్యార్థుల మానసిక ఒత్తిడిని తగ్గించుకోటానికి, శారీరక దృఢత్వానికి ఆటలు ఎంతో మేలు చేస్తాయని పేర్కొన్నారు. కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డి.రాము అధ్వర్యంలో ఈ లీగ్ జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, డిప్లొమా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.జయకృష్ణ, బీఎస్‌హెచ్ విభాగాధిపతి డాక్టర్ వి.వి.సుబ్బారావు, కళాశాల



పోటీలను ప్రారంభిస్తున్న కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్ కుమార్

ఆర్డీ డీన్ డాక్టర్ పి.బాలమురళీకృష్ణ, ఈసీఈ, కంప్యూటర్ సైన్స్, ఆర్టిఫిషల్ ఇంటిలెజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, మెకానికల్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతులు డి.నాగ రవి కిరణ్, జి.రామచంద్ర రావు, ఎస్.శాంతి ప్రియా, డాక్టర్ డి.కల్యాణ్ కుమార్, వి.సాయి శ్రీనివాస్, పి.గాంధీ, కే నాయక్ పాల్గొన్నారు.

రైతు రుణాలు మాఫీ చేయాలి

తాడేపల్లిరూరల్: రాష్ట్రంలో ఉన్న రైతు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరావు డిమాండ్ చేశారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మోటార్లకు 9 గంటల విద్యుత్ నిరంతరాయంగా అందించి పంటలను కాపాడాలని కోరారు. కౌలు రైతులకు భూ యజమానితో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు, బ్యాంకు రుణాలు, సబ్సిడీలను ఇవ్వాలన్నారు. దేవదాయ భూములను సాగు చేసుకుంటున్న పేద, కౌలు రైతులందరికీ బహిరంగ వేలంపాటలు లేకుండా అతి తక్కువ కౌలు వసూలు చేయాలని అన్నారు. అనంతరం తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు దొంతిరెడ్డి వెంకట రెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు, అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, షేక్ ఎర్రపీరు, టి. బక్కిరెడ్డి, వీరాస్వామి, గోపులు, పల్లపాటి సుబ్బారావు పాల్గొన్నారు.



తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డిసెంబర్ వరకు ఉచిత బియ్యం

తహసీల్దార్ ఫణీంద్ర బాబు

తాడికొండ: డిసెంబర్ వరకు రేషన్ బియ్యం ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందని తహసీల్దార్ జీవీఎస్ ఫణీంద్ర బాబు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల విజిలెన్స్ కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలుంటే సరిదిద్ది సక్రమంగా ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన విజిలెన్స్ కమిటీ సూచనల ద్వారా మెరుగైన పంపిణీ వ్యవస్థను తయారు చేయాలని కోరారు. ఇందుకోసం రెవెన్యూ, మీడియా, పంచాయతీ రాజ్, విద్యాశాఖ, రేషన్ డీలర్ల నుంచి కొంతమంది సభ్యులను ఎంపిక చేసి విజిలెన్స్ కమిటీని నియమించినట్లు తెలిపారు. ఈనెల రేషన్ బియ్యంతో పాటు గోధుమ పిండి, పంచదార సరఫరాకు సిద్ధం చేసినట్లు చెప్పారు. ఎండీయూ ఆపరేటర్లు తెల్ల రేషన్ కార్డులకు పంచదార కిలో రూ.17, అంత్యోదయ అన్నదాన యోజన కార్డులకు రూ.13.50, కందిపప్పు కిలో రూ.67, గోధుమ పిండి కేజీ రూ.16 ధరకు అందించాలని అంతకంటే ఎక్కువ ధర తీసుకుంటే తమకు ఫిర్యాదు చేయాలన్నారు. నాణ్యత లేని సరుకులు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా వస్తే వాటిని తమ దృష్టికి తీసుకొస్తే తిరిగి వెనక్కి పంపించి నాణ్యత కలిగిన సరుకును రప్పిస్తామన్నారు. ప్రభుత్వం కేజీ రూ.40 చొప్పున బియ్యం, ఇతర సరుకులు కాంట్రాక్టర్ల ద్వారా కొనుగోలు చేసి పేదలకు అందిస్తుంది కనుక నాణ్యతలో లోపాలుంటే రాజీ పడవద్దన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అత్తోట దీప్తి, ఎంఈఓ తెనాలి ఇందిర, సివిల్ సప్లయిస్ ఆర్ఐలు కోటేశ్వరరావు, అనీల్ పాల్గొన్నారు.

తుళ్ళూరులో...

తుళ్లూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కళ్యాణి ఆధ్వర్యంలో విజిలెన్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా నడిపేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. ఏమైనా లోపాలుంటే తమ దృష్టికి తీసుకొస్తే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బి.శివన్నారాయణ, ఎంఈఓ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

యార్డులో పారదర్శకంగా వ్యాపార లావాదేవీలు

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో వ్యాపార లావాదేవీల్ని పారదర్శకంగా కొనసాగించాలని చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ సూచించారు. యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి, వైస్ చైర్మన్ షేక్ మాబు సుభాని, పాలకవర్గ సభ్యులతో కలసి సోమవారం ఉదయం ఆయన యార్డును సందర్శించారు. వ్యాపార లావాదేవీలు, మిర్చి నాణ్యత, ధరలపై ఎగుమతి, దిగుమతి వ్యాపారుల్ని అడిగి తెలుసుకున్నారు. యార్డులో మిర్చి రైతులతో మాట్లాడారు. వసతులు ఏ విధంగా ఉన్నాయి.. గిట్టుబాటు ధర లభిస్తుందా..? లేదా? అడిగి తెలుసుకున్నారు. యార్డు ఆవరణలోని టీ స్టాల్స్, కూల్ డ్రింక్స్ షాపులు, బడ్డీ కొట్లను సందర్శించి, వారు విక్రయిస్తున్న ధరలు, నాణ్యతను ఆరా తీశారు. ఈ సందర్భంగా చైర్మన్ రాజనారాయణ మాట్లాడుతూ మిర్చి రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా వసతులు కల్పించడంతో పాటు, మెరుగైన ధర లభించేలా చూడాలని వ్యాపారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో యార్డు ఇన్‌చార్జి శివారెడ్డి పాల్గొన్నారు.

తెలుగు భాష కీర్తికి బాలసుబ్రహ్మణ్యం కృషి

వీసీ ఆచార్య రాజశేఖర్

ఏఎన్‌యూ: తెలుగు భాషకు కీర్తి తెచ్చేందుకు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నిరంతరం కృషి చేశారని వీసీ పి. రాజశేఖర్ కొనియాడారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్కూల్ ఆఫ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగంలో సోమవారం వర్ధంతి నిర్వహించారు. బాలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం సేవలు యావత్ దేశానికి తలమానికంగా నిలిచాయని తెలిపారు. సంగీత ప్రపంచానికి ఆయన లేని లోటు పూడ్చలేనిదని పేర్కొన్నారు. ఆయన పేరుతో యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన ఫెర్ఫార్మింగ్ ఆర్ట్స్ విభాగం భవిష్యత్‌లో కల్చరల్ హబ్‌గా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ బి.కరుణ, విభాగాధిపతి డాక్టర్ జి.అనిత, కోర్సు కో-ఆర్డినేటర్ డాక్టర్ జె.మధుబాబు, ఓఎస్‌డీ సునీత, సీసీడీ డీన్ కె.మధుబాబు, ప్రిన్సిపాల్స్ జాన్సన్, ఈ. శ్రీనివాసరెడ్డి, బాలు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.